## సంక్రాంతి యువజనోత్సవాలను జయప్రదం చేయండి

డివైఎఫ్ఐ

**ప్రజాశక్తి - పెనుమంట్ర**

పాలమూరులో కలిసింది సూర్యనారాయణరాజు జనవిజ్ఞాన కళావేదిక వద్ద 35వ సంక్రాంతి యువజనోత్సవాలను జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చింతపల్లి మావో కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతియేటా మాదిరిగానే సంక్రాంతి ముసుగులో పేకాట, కోడిపందేలు వంటి జూద క్రీడలకు వ్యతిరేకంగా ఈ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 'మత్తు పదార్థాలను, మాదకద్రవ్యాలను అరికట్టాలి.. యువత భవిష్యత్తును కాపాడాలి' అనే నినాదంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 11, 12 తేదీల్లో వాలీబాల్ పోటీలు పాలమూరు హైస్కూల్ గ్రౌండ్‌లో జరుగుతాయని పేర్కొన్నారు. పండగ మూడు రోజులూ గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

హక్కులను హరించే..

# జిఒ నెం.1ని రద్దు చేయాల్సిందే

### ఐలు రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

మాట్లాడుతున్న దిగుపాటి రాజగోపాల్

**ప్రజాశక్తి - భీమవరం**

'ప్రజాస్వామ్యంలో జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నించడంతోపాటు అవసరమైన సందర్భాల్లో నిరసన, ఆందోళన తెలిపే హక్కును రాజ్యాంగం కల్పించింది. ఆ హక్కును హరించే విధంగా ప్రజల గొంతును నొక్కే వైసిపి ప్రభుత్వం జిఒ నెం.1ని తీసుకురావడం అత్యంత దుర్మార్గం. హక్కులను హరించే జిఒను రద్దు చేసే వరకూ పోరాటం సాగిస్తాం' అని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రౌండ్‌టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. స్థానిక యుటిఎఫ్ భవనంలో ఆదివారం ఐలు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నెం.1ని రద్దు చేయాలని కోరుతూ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో టిడిపి, జనసేన, సిపిఎంతోపాటు వివిధ ప్రజా, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడంతోపాటు ప్రజలు, ప్రతిపక్షాల గొంతు నొక్కే జిఒను తిప్పికొట్టి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. జిఒ నెం.1ని రద్దు చేసే వరకూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ పౌరుల సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎం.వైకుంఠరావు, జెవివి జిల్లా కార్యదర్శి మల్లుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

**జిఒ నెం.1 అప్రజాస్వామికం**
**దిగుపాటి రాజగోపాల్, మాజీ ఎంఎల్‌ఎ**

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ నెం.1 అప్రజాస్వామికం. ఇప్పటికే ప్రశ్నించే వారిపై నిర్బంధాలు చేస్తున్నారు. బహిరంగ సభలు, ర్యాలీలు, నిరసనలు చేపట్టడమంటే ప్రభుత్వ విధానాలపై ప్రశ్నించడమే. ప్రశ్నిస్తే నిర్బంధిస్తామంటే ప్రజాస్వామ్యంలో ఉన్నామా అనే అనుమానం కలుగుతోంది.

**నియంత పాలన సాగుతోంది**
**చెల్లబోయిన రంగారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి**

రాష్ట్రంలో నియంత పాలన సాగుతోంది. హక్కుల కోసం ప్రజలు ప్రభుత్వ విధానాలపై ప్రశ్నిస్తే నిర్బంధిస్తారా. ప్రజాస్వామిక వ్యవస్థలో అణచివేయాలని చూస్తే ప్రతిఘటన తప్పదు. అన్ని రాజకీయ పార్టీలు దీనిపై పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది. వైసిపి పాలనను తిప్పికొట్టకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు. అంతా ఐక్యంగా జిఒను రద్దు చేసే వరకూ పోరాడాలి.

**దురుద్దేశంతోనే జిఒ విడుదల**
**జెఎన్‌వి.గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు**

ప్రభుత్వం జిఒ నెం.1ని విడుదల చేయడంలో దురుద్దేశం ఉంది. ఆనాడు బ్రిటీష్ వాళ్లు తెచ్చిన చట్టాన్ని నేడు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చి ప్రజల గొంతు నొక్కుతుంది. ఆనాడు స్వాతంత్రోద్యమంలో పాల్గొనకుండా బ్రిటీష్ వాళ్లు దేశ పౌరులను నిర్బంధిస్తే నేడు జగన్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను నిర్బంధిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో నియంతృత్వపాలన సాగిస్తున్న జగన్ నీటి పన్ను, చెత్త పన్ను వంటి భారాలతో ప్రజలను ఇబ్బందుల పెడుతున్నారు. ప్రజల హక్కులను కాల రాస్తున్న ప్రభుత్వాన్ని ప్రశ్నించకూడదనే ఈ జిఒను తీసుకురావడం నియంతృత్వమే. రాష్ట్రంలో ఉద్యోగులు, కార్మికులు, రైతులు, కూలీలు హక్కుల కోసం పోరాడుతున్నారు. ఆ పోరాటాలను అణిచివేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

**ప్రభుత్వం ప్రజలను బానిసల్లా చూస్తోంది**
**జి.జేమ్స్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు**

ప్రభుత్వం ప్రజలను బానిసలుగా చూస్తోంది. హక్కులను కాపాడుకోవడం కోసం ఎన్ని నిర్బంధాలనైనా ప్రతిఘటిస్తాం. జిఒ నెం.1ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావడం అన్యాయం. ప్రజా సమస్యలపై పోరాడే కమ్యూనిస్టులే ప్రజలకు అండగా నిలుస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలను బానిసలుగా చూడటం వైసిపి ప్రభుత్వ దుర్మార్గపు పాలనకు నిదర్శనం.

**ప్రభుత్వం ఊసరవెల్లిలా వ్యవహరిస్తోంది**
**జక్కంశెట్టి సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి**

వైసిపి ప్రభుత్వం ఊసరవెల్లిలా వ్యవహరిస్తోంది. ప్రమాద ఘటనను ఆసరాగా చేసుకుని నిర్ణయాలు చేయడం సిగ్గుచేటు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా, అధికారంలోకి వచ్చాక మరోలా మాట్లాడటం వైసిపికే చెల్లింది. పాదయాత్ర, ఓదార్పు యాత్రలు పెద్దఎత్తున నిర్వహించిన జగన్మోహన్‌రెడ్డి నేడు ముఖ్యమంత్రి కాగానే కనీసం ప్రశ్నించే హక్కును కూడా కాలరాయడం దారుణం.

**జిఒ నెం.1 వ్యతిరేక పోరుకు మద్దతు**
**కె.క్రాంతిబాబు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి**

జిఒ నెం.1కి వ్యతిరేకంగా సాగే పోరాటాలకు కెవిపిఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోంది. దళితుల సమస్యలు పరిష్కరించడంలోనే కెవిపిఎస్ ప్రధాన భూమిక పోషిస్తోంది. ప్రజల హక్కును కాలరాస్తే చూస్తూ ఊరుకోబోం. జిఒ నెం.1ని వెనక్కి తీసుకునే వరకూ ఐక్య పోరాటాలు చేపడతాం.

**జిఒ నెం.1ని అధికార పార్టీ నేతలే ధిక్కరిస్తున్నారు**
**సిహెచ్.చంద్రశేఖర్, జనసేన పట్టణ అధ్యక్షులు**

ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నెం.1ని అధికార పార్టీ నాయకులే ధిక్కరించడం సిగ్గుచేటు. ప్రభుత్వ నిర్ణయాలు వారికి ఒకలా, మిగిలిన రాజకీయ పార్టీలకు మరోలా ఉంటున్నాయి. ఇది సరైన పద్ధతి కాదు. ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వానికి పతనం తప్పదు.

**తక్షణం జిఒ నెం.1ని రద్దు చేయాలి**
**బి.వాసుదేవరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు**

ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నెం.1 కేవలం ప్రతిపక్షాలకే అన్నట్లు ఉంది. అధికార పార్టీకి చెందిన నాయకులైతే ఇష్టానుసారంగా ర్యాలీలు, సభలు, సమావేశాలు జరుపుకోవచ్చా. ప్రతిపక్షాలు మాత్రం నోరు మెదిపితే గొంతు నొక్కుతుండటం దుర్మార్గం. రాష్ట్రంలో అన్ని తరగతుల ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. తక్షణం ప్రభుత్వం జిఒ 1ని రద్దు చేయకపోతే ఉద్యమిస్తాం.

**బ్రిటీష్ కాలం నాటి చట్టాల అమలు తగదు**
**మెంటే పార్థసారథి, టిడిపి రాష్ట్ర కోశాధికారి**

బ్రిటీష్ కాలం నాటి చట్టాలను నేడు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. రాష్ట్రంలో ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తూ నియంతృత్వంగా జగన్ వ్యవహరిస్తున్నారు. టిడిపి అధినేత చంద్రబాబు సభలో దురదృష్టకరమైన ఘటనలు జరగడం బాధాకరం. పోలీసు బందోబస్తు పటిష్టంగా లేకపోవడం వల్ల ఈ రెండు ఘటనలు జరిగాయి. ఆ పేరుతో సభలు, సమావేశాలు జరపొద్దనడం సబబు కాదు.

# జిఒ నెం.1ని ఉపసంహరించుకోవాలి

మాట్లాడుతున్న వర్మ

**ప్రజాశక్తి - తణుకు రూరల్**

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ నెం.1ని వెంటనే ఉపసంహరించుకోవాలని రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ఆదివారం నాడు ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు), పౌర హక్కుల సంఘం ఆధ్వర్యంలో జిఒ నెం.1 రద్దు కోరుతూ పాత పోస్టాఫీస్ వీధిలోని కార్యాలయంలో సమావేశం కామన మునిస్వామి అధ్యక్షతన జరిగింది. ముఖ్య ఆహ్వానితులు దారిదీపం సంపాదకులు డివివిఎస్.శర్మ మాట్లాడుతూ ఈ జిఒ రాష్ట్రంలోని ప్రజల ప్రాథమిక హక్కులను హరించేలా ఉందన్నారు. దేశంలో, రాష్ట్రంలో అధ్యక్ష తరహా పరిపాలన ప్రారంభమైనప్పుడు ఇటువంటి జిఒలు విడుదలవుతాయని విమర్శించారు. ఈ జిఒ వల్ల ప్రజలు తమ సమస్యలను చెప్పుకునే అవకాశం, హక్కును కోల్పోతారన్నారు. ఈ జిఒను వెంటనే నిలుపుదల చేయాలని వర్మ డిమాండ్ చేశారు. మిగిలిన వక్తలు మాట్లాడుతూ రాజ్యాంగంలో 19 నుంచి 22 వరకు ప్రజలకు ప్రాథమిక హక్కులను కల్పించిందని గుర్తు చేశారు. ఆ హక్కులను ఇటువంటి జిఒల ద్వారా హరించాలనుకోవడం అవివేకమన్నారు. జగన్ ప్రతిపక్ష నేతగా తన పాదయాత్ర మున్సిపల్, ఆర్అండ్‌బి రోడ్లపైనే నిర్వహించారని, తణుకు పట్టణంలో నాలుగు రోడ్ల కూడలిలో రోడ్డుపైనే తన సభను నిర్వహించారని మరిచారా అని ప్రశ్నించారు. జిఒ నెం.1ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో టిడిపి నాయకులు మారుతీరావు, కాంగ్రెస్ నాయకులు డి.రామకృష్ణ, సిపిఐ నాయకులు బొద్దాని నాగరాజు, సిపిఎం నాయకులు పివి.ప్రతాప్, ప్రముఖులు ఎస్.మనోరమ, డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు, జనసేన నాయకులు అనుకుల రమేష్, న్యాయవాదులు జి.అంబేద్కర్, పౌర హక్కుల సంఘం నాయకులు కౌరు వెంకటేశ్వరరావు, సామాజిక పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలూరు మురళి, సమతా ఫౌండేషన్ అధ్యక్షులు నీలం మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బల్ల చినవీరభద్రం, ఎస్ఎఫ్ఐ నాయకులు డి.అప్పారావు, కల్లుగీత కార్మిక సంఘం నాయకులు గుబ్బల వీరరాఘవులు, కౌలు రైతుసంఘం నాయకులు తాతారావు, సిఐటియు నాయకులు గుబ్బల గోపీ, తూరుగోపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎం ఆధ్వర్యాన జిఒ నెం.1 ప్రతుల దహనం

**ప్రజాశక్తి - పోడూరు**

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నెం.1ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్, నాయకులు బొంతు శ్రీను డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో స్థానికంగా జిఒ నెం.1 ప్రతులను ఆదివారం దహనం చేశారు. ఈ ప్రసాద్, శ్రీను మాట్లాడుతూ ప్రదర్శనలు, బహిరంగ సభలు జరపకూడదని జిఒ తీసుకురావడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో ముడే మోజేష్, కాకర వెంకటేశ్వర్లు, రాపాక పెద్దిరాజు, బొల్లా శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోడూరులో ప్రతుల దహనం

# సేవా కార్యక్రమాలు అభినందనీయం

### శృంగవృక్షం సర్పంచి జంగం సూరిబాబు

విద్యార్థులతో సర్పంచి సూరిబాబు

**ప్రజాశక్తి - పాలకోడేరు**

భీమవరం ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు గ్రామంలో వివిధ అంశాలపై సర్వే నిర్వహించి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని శృంగవృక్షం సర్పంచి జంగం సూరిబాబు అన్నారు. గ్రామంలో ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆదివారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి సూరిబాబు మాట్లాడారు. గ్రామస్థాయిలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అవసరమని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. డిగ్రీ కళాశాల విద్యార్థులు గ్రామం వచ్చి వివిధ అంశాలపై సర్వే చేశారన్నారు. అనంతరం పంచాయతీ ప్రాంగణంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వి.కమల్, ఎన్ఎస్ఎస్ ప్రోగాం ఆఫీసర్ ఆర్.నాగేంద్రబాబు, మహాత్మాగాంధీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ యు.భగత్‌కుమార్, సర్వే పర్యవేక్షణాధికారి యు.సంపతరావు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# శశి స్కూల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు

సంక్రాంతి సంబరాల్లో ప్రముఖులు, విద్యార్థులు

**ప్రజాశక్తి - ఉండి**

సంక్రాంతి విశిష్టతను విద్యార్థులకు తెలియజేయడం కోసం సంక్రాంతి సంబరాలను నిర్వహించిన శ్రీ శశి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ యాజమాన్యాన్ని, సిబ్బందిని జెడ్‌పిటిసి రణస్తుల కనకదుర్గ మహంకాళి, గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ అభినందించారు. ఆదివారం స్థానిక శ్రీ శశి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలను స్కూల్ కరస్పాండెంట్ ఖండాపు శ్రీనివాసరావు నాగమణి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జెడ్‌పిటిసి, గ్రామ సర్పంచితోపాటు ఉప సర్పంచి గొట్టుముక్కల కళ్యాణ్‌వర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంబరాల్లో విద్యార్థులు ప్రదర్శించిన వేషధారణలు, బొమ్మలకొలువులు, పల్లెటూరు వాతావరణాన్ని మైమరిపించేలా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను, పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కరిమెరక శివనాగరాజు, కరిమెరక మల్లికార్జున్, గలవిల్లి ధనుంజయ, శశి స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్షలు

### 2014 మంది హాజరు - 1349 మంది గైర్హాజరు

పరీక్షా హాలులో జెసి తనిఖీ

**ప్రజాశక్తి - భీమవరం**

జిల్లా కేంద్రం భీమవరంలో ఆదివారం నిర్వహించిన ఎపిపిఎస్‌సి గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పట్టణంలోని పది కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో అధికార యంత్రాంగం పకడ్బందీగా పరీక్షలు నిర్వహించింది. మొత్తం 4063 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 2714 మంది మాత్రమే పరీక్షలు రాశారు. 1349 మంది గైర్హాజరయ్యారు. 66.80 శాతం హాజరు నమోదైంది. ఈ పరీక్షా కేంద్రాలను ఎపిపిఎస్‌సి సభ్యులు వెంకటరమణారెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ జెవి.మురళీ, జిల్లా ఎస్‌పి రవిప్రకాష్, జిల్లా ఇన్‌ఛార్జి రెవెన్యూ అధికారి దాసి రాజు పరిశీలించారు.

# సిపిఎస్ రద్దు కోరుతూ 2కె రన్

2కె రన్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు

**ప్రజాశక్తి - తణుకురూరల్**

సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను కొనసాగించాలని, పాదయాత్రలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి టిజె.జయకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ ఆధ్వర్యాన సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆదివారం స్థానిక రామభద్ర కాంప్లెక్స్ వద్ద నుండి వెంకటేశ్వర థియేటర్ సెంటర్ మీదుగా నరేంద్ర సెంటర్ వరకు, తిరిగి రామభద్ర కాంప్లెక్స్ వద్దకు డివిజన్ స్థాయిలో 2కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జయకుమార్ మాట్లాడుతూ సిపిఎస్‌ను ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీ ప్రకారం రద్దు చేయాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు ఏవైతే హామీలిచ్చారో వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల జారీ చేసిన జిఒ నెం.1ని వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పివి.ప్రతాప్, న్యాయవాది కామన మునిస్వామి, యుటిఎఫ్ నాయకులు జి.వీరన్న, కె.కిరణ్‌కుమార్, ఎం.దేవదత్తం, జి.రవి, కెవి.ఆచార్యులు, కౌరు రాంబాబు, గూడూరి వెంకటేశ్వరరావు, ఉమాదేవి, సావిత్రి, దుర్గాంబ దీప్తి, పాలా సురేష్, పాపలింగేశ్వరరావు, శివప్రసాద్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయాల సేవలను వినియోగించుకోండి

### జెడ్‌పి ఛైర్మన్ కవురు, ఎంఎల్‌ఎ గ్రంధి


సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న కవురు, గ్రంధి

**ప్రజాశక్తి - వీరవాసరం**

ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి సిఎం జగన్మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. తోకలపూడిలో రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని వారు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ సచివాలయాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిర్ణీత గడువులో సచివాలయాల ద్వారా అన్ని సేవలందిస్తున్నట్లు తెలిపారు. తొలుత గంధం సోమసుందరం జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు నిర్మించిన బస్ షెల్టర్‌ను, వాటర్‌ప్లాంట్‌ను ఎంఎల్‌ఎ గ్రంధి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవచేయడంలో ఉన్న తృప్తి మరెక్కడా ఉండదన్నారు. గంధం వెంకటస్వామినాయుడు కుటుంబాన్ని ఎంఎల్‌ఎ అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వీరవల్లి శ్రీనివాస్, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, ఎంపిటిసి కొల్లేపర శ్రీనివాసరావు, నాగరాజు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

# ధర్మమే గెలిచింది

### జగన్నాధపురం ఫలితంపై డిప్యూటీ సిఎం కొట్టు

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

జగన్నాధపురం పంచాయతీ ఎన్నికల్లో ధర్మమే గెలిచిందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ వ్యాఖ్యానించారు. జగన్నాధపురం పంచాయతీ సర్పంచి ఎన్నికకు సంబంధించి రీకౌంటిగ్ ఫలితంగా ఆయన ఆదివారం స్పందించి మాట్లాడారు. రీకౌంటింగ్ జరగకుండా ఆపాలని తెలుగుదేశం పార్టీ ప్రయత్నించడం దారుణమన్నారు. తాడేపల్లిగూడెం మండలం జగన్నాధపురం పంచాయతీకి గతంలో జరిగిన ఎన్నికల్లో టిడిపి మద్దతుదారైన సర్పంచి అభ్యర్థి పి.గౌరీ మూడు ఓట్లు ఆధిక్యతతో గెలిచినట్లు అప్పటి ఎన్నికల రిటర్నింగ్ అధికారి ధ్రువీకరించారన్నారు. అయితే దీనిపై వైసిపి మద్దతుదారైన సర్పంచి అభ్యర్థి ఉంగ్రాజవరపు చంద్రిక రీకౌంటింగ్‌కు పట్టుబట్టగా ఒకసారి మాత్రమే రీకౌంటింగ్ చేసి మూడు ఓట్లు మెజార్టీతో గౌరీని విజేతగా ప్రకటించారని గుర్తు చేశారు. దీనిపై చంద్రిక కోర్టును ఆశ్రయించగా కోర్టు రీకౌంటింగ్‌కు ఆదేశించిందని, దీంతో శనివారం తాడేపల్లిగూడెం కోర్టులో జగన్నాధపురం పంచాయతీ ఓట్లు రీకౌంటింగ్ నిర్వహించారని తెలిపారు. నాడు మూడు ఓట్లు మెజార్టీతో గెలిచినట్లు ప్రకటించిన గౌరీ మూడో స్థానంలోకి వెళ్లారని, వైసిపి మద్దతుదారు చంద్రికకు 27 ఓట్లు ఆధిక్యత లభించిందని తెలిపారు. ఆమె ఆదివారం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను కొట్టు అభినందించారు. ఈ సందర్భంగా అప్పటి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కుట్రకు పాల్పడ్డారని ఆరోపించారు. సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి ముప్పిడి సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కొవ్వలి ఫౌండేషన్ సేవలు భేష్

### వైద్య శిబిరంలో డాక్టర్ చినమిల్లి

వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

**ప్రజాశక్తి - నరసాపురం**

సర్వ రోగనివారిణి ఆక్యుపంక్చర్ (సూది వైద్యం) వైద్యమని వైఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్, ప్రముఖ వైద్యులు చినమిల్లి సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం స్థానిక తెలగా కళ్యాణ మండపంలో కొవ్వలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో టిఎన్ఆర్ ఫిజియోథెరపీ సహకారంతో ఏర్పాటు చేసిన ఆక్యుపంక్చర్ (సూది వైద్యం), నేచురోపతి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సయాటికా, స్పాండిలైటిస్, అస్తమా, సుగర్, బిపి తదితర దీర్ఘకాలిక నొప్పులు, వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆక్యుపంక్చర్ వైద్యం ఉపశమనం కల్గిస్తుందన్నారు. కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ యతి రాజ రామ్మోహననాయుడు సేవలు ఆదర్శనీయమన్నారు. కొవ్వలి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి కొండా శ్రీధర్ నరసాపురంలో ఉచితంగా ఆక్యుపంక్చర్, నేచురోపతి వైద్య సేవలను ప్రజలకు అందించడం గొప్ప విషయమన్నారు. శిబిరంలో శ్రీధర్‌తోపాటు వైద్యులు టి.నరసింహరాజు, బాల శ్రీనివాస్, పార్వతీపురానికి చెందిన బి.భువనేశ్వరి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో కొవ్వలి ఫౌండేషన్ కోశాధికారి జయలక్ష్మి, సంకు భాస్కర నాయుడు, కోటిపల్లి కన్నబాబు, రాట్నాల రామారావు, ఆరేటి వేణుగోపాల్, భోగిరెడ్డి ముత్యం, నిమ్మకాయల బాబ్జీ, కోటిపల్లి గోపాలరావు, పంజా దినేష్, మల్లాడి మూర్తి, గ్రంధి లక్ష్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - కాళ్ల

విద్యార్థి దశలో మరపురాని జ్ఞాపకాలను నెమరువేసుకునే ఆత్మీయ సమ్మేళనం ఎన్నటికీ మరువలేనిదని పలువురు పూర్వ విద్యార్థులు అన్నారు. మండల కేంద్రమైన కాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990-91 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సూర్యనారాయణరాజు, మెట్టుపల్లి రామకృష్ణ, బాపిరాజు, తదితరులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు పాఠశాలకు రూ.80 వేల విలువైన సౌండ్ సిస్టం బహుకరించారు. ఈ కార్యక్రమంలో గనిశెట్టి షణ్ముఖేశ్వరరావు, తోట రామకృష్ణ, నాని, వేగేశ్న వెంకటరాజు, సాదు శ్రీను, కేశిరెడ్డి మల్లికార్జున, కొల్లి సుబ్బారావు, పూసవేని, మాధవి, భారతి, గాయత్రి పాల్గొన్నారు.

## ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో జాయ్ విన్సెంట్ ప్రతిభ

ప్రజాశక్తి - పాలకోడేరు

ఈ నెల రెండో తేదీ నుంచి ఐదు రోజుల పాటు నాగపూర్‌లో జరిగిన 108వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో పశ్చిమ విద్యార్థి విజయకేతనం ఎగరవేశాడు. వేములదీవి బిసి సంక్షేమ పాఠశాల ఏడో తరగతి విద్యార్థి సిహెచ్.జాయ్‌విన్సెంట్ ప్రతిభ కనబరిచాడు. ఈ మేరకు జాతీయ బాల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త మల్లుల శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎకో (ఫ్రెండ్లీ టీస్పూ) పర్యావరణ హితంగా ఉండటంతో పాటు ఆరోగ్యదాయకంగా ఉంటాయని తెలిపారు. టీ తాగిన తర్వాత వాటిని తినవచ్చని చెప్పారు. ఈ టీమ్ తిరిగి అహ్మదాబాద్‌లో జనవరి 25, 26 తేదీల్లో జరిగే 30 వ జాతీయ బాల సైన్స్ కాంగ్రెస్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఎంఎల్ఏ శ్రీరంగనాథరాజును సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

## ఘనంగా పల్లాలమ్మ జాతర మహోత్సవం

ప్రజాశక్తి - పెనుమంత్ర

ఆలమూరులో పల్లాలమ్మ జాతర మహోత్సవం రెండో రోజు ఆదివారం ఘనంగా కొనసాగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు పోటెత్తారు. ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ వారు ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజును సన్మానించారు. యాత్రికులు తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా రాజమండ్రి నుంచి భీమవరం వెళ్లే ప్రయాణికులు పాలకొల్లు మీదుగా, తాడేపల్లిగూడెం నుంచి ఆచంట వెళ్లే ప్రయాణికులు తణుకు మీదుగా వెళ్లాల్సి ఉంటుందని పోలీసులు తెలిపారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నరసాపురం సబ్ డివిజన్ పరిధిలో పోలీస్ అధికారులంతా ఈ జాతర మహోత్సవంలో భద్రత చర్యల్లో పాల్గొంటారని ఎస్ఐ బి.సురేంద్రకుమార్ తెలిపారు.

## పాలకొల్లు తూర్పు కాపు సంఘం గౌరవాధ్యక్షులుగా శ్రీనివాస్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు తూర్పుకాపు ఐక్య కమిటీ పట్టణ సంఘం గౌరవ అధ్యక్షులుగా కోరాడ శ్రీనివాస్, బెజ్జవరపు నాగరాజు, అధ్యక్షులుగా గేదెల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఉన్న కమిటీకి అనుగుణంగా మార్పులు చేశారు. ఈ మేరకు పాలకొల్లులో తూర్పు కాపు సంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నేతలు మాట్లాడుతూ జిల్లా కార్యవర్గంలో పదవులకు సమావేశం నిర్వహించనున్నట్లు సంఘ నేతలు చెప్పారు. పాలకొల్లు తూర్పుకాపు సంఘం ఏర్పాటైన దగ్గర నుంచి ఇప్పటివరకు పార్టీలకు అతీతంగా పలు కార్యక్రమాలు చేసి పలువురికి సహాయ సహకారాలు చేశారు. మీసాల రాము, లోపింటి చిరంజీవి, పిల్లా సత్తిబాబు, బాకూరు నిరంజన్, జమ్ము కాశీ, చీర సత్తిబాబు, పొట్నూరి రమేష్, మామిడి సత్యనారాయణ, మజ్జి అప్పలనాయుడు, కొంగరాపి ధనరాజు, రఘుమండ రమణ, బోర నరేష్, శిడగం సురేంద్ర, గేదెల జానకిరామ్, దేవి కిషోర్, లోపింటి మురళీకృష్ణ, పెద్ద పృధ్వి, పిల్ల మోహన్, ఇప్పిలి మణికంఠ, రాము, కుదిగాన రమేష్ పాల్గొన్నారు.

## యాత్రికులతో ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్య నిర్వహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు ఛైర్మన్ కొల్లాటి రామారావు, ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి సౌకర్యాలు కలగకుండా ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో భజన కాలక్షేపం ఏర్పాటు చేశారు.

## 11న ఎంఆర్‌పిఎస్ జాతీయ మహాసభ

ప్రజాశక్తి - ఆచంట

ఈ నెల 11వ తేదీన బెంగళూరులో జరగనున్న ఎంఆర్‌పిఎస్ జాతీయ మహాసభను జయప్రదం చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా కన్వీనర్ కనపాల పెద్దిరాజు పిలుపునిచ్చారు. ఆచంట మండలంలోని వేమవరం గ్రామం పెద్దపేటలో ఎంఎస్‌పి గ్రామ నాయకులు నార్కి మిల్లి ఇస్సాకు ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా కన్వీనర్ కనపాల పెద్దిరాజు మాట్లాడుతూ మన్యశ్రీ మందకృష్ణ ఆదేశాల మేరకు జనవరి 11వ తేదీన బెంగళూరులో నిర్వహించే ఎంఆర్‌పిఎస్ జాతీయ మహాసభలో ఎంఎస్‌పి, ఎంఇఎఫ్, ఎంఎస్ఎఫ్, విహెచ్‌పిఎస్, ఎంయుఎఫ్, ఎంఎంఎస్ అన్ని అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఖండవిల్లి సుబ్బారావు, కనపాల మారీసు నార్కి మిల్లి శాంతరావు, రామారావు, చెదలవాడ వర్మ, ఎన్.బాబి, మహిళ నాయకురాలు లక్ష్మి పాల్గొన్నారు.

# నేరాలు - ఘోరాలు

## చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి ఒక వ్యక్తి మృతి చెందాడు. వన్‌టౌన్ ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక చిన్న అప్పారావు తోటకు చెందిన తానాల సత్యనారాయణ (52) ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. నిత్యం గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ఉన్న సోమగుండం చెరువు చుట్టూ వాకింగ్ చేస్తూ ఉంటాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం కూడా వాకింగ్‌కి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులోకి జారాడు. ఆదివారం ఉదయం సత్యనారాయణ మృతదేహాన్ని స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుని కుమారుడు కేశవ నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కాళీపట్నంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ శాఖ సిఐ పి.శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు వాహన తనిఖీలు చేశారు. ఈ తనిఖీలో గుంటూరు జిల్లా చెరుకుపల్లి నుంచి మండపేటకు లారీలో తరలిస్తున్న 210 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ బియ్యాన్ని డిటి నరేష్‌కుమార్‌కు స్వాధీనం చేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

# పేదలను దోచేస్తున్న వడ్డీ వ్యాపారులు

### పెంటపాడులో నిబంధనలు అతిక్రమించి వ్యాపారం
### పోలీసులు స్పందించాలని వేడుకోలు

ప్రజాశక్తి - పెంటపాడు

కుబేరుల వడ్డీతో ప్రజలు కుదేలవుతున్నారు. పెంటపాడు మండలంలో నిత్యం బహిరంగంగా వడ్డీ వ్యాపారం జరుగుతోంది. ఎటువంటి నియమ నిబంధనలు లేకుండా పేదలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పేదల అవసరాలను గుర్తించి ఇష్టానుసారంగా వడ్డీ వ్యాపారం కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వడ్డీ వ్యాపారం చేయాలంటే ఆ వ్యాపారం చేసే వ్యక్తికి లైసెన్స్ ఉండాలి. కాని పెంటపాడు మండలంలో వడ్డీ వ్యాపారులకు అటువంటి లైసెన్స్‌లు ఏమీ లేవనీ ప్రజలు చెబుతున్నారు. సుమారు రూ.50 వేలతో వడ్డీ వ్యాపారం ప్రారంభించి రెండు మూడు సంవత్సరాల్లోనే లక్షలో టర్నోవర్ చేస్తున్నారంటే వడ్డీ వ్యాపారం ఏవిధంగా చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. బడ్డీ కొట్టు వ్యాపారం దగ్గర నుంచి పెద్ద వ్యాపారుల వరకు ఈ వడ్డీ వ్యాపారులపై ఆధారపడుతున్నారు. దీంతో వడ్డీ వ్యాపారులు లైసెన్స్ లేకుండా నియమ నిబంధనలు పాటించకుండా వ్యాపారం చేస్తున్నారు. కొంతమంది ఈ వడ్డీ భారాలు తట్టుకోలేక వ్యాపారాలు వదిలి గ్రామాలకు వెళ్లిపోతున్నారు. గతంలో కాల్ మనీ పేరుతో వడ్డీ వ్యాపారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీంతో కొంతవరకు ప్రజలకు న్యాయం జరిగింది. పెంటపాడులో రోజుకు రూ.లక్షల్లో వడ్డీ వ్యాపారం జరుగుతోంది. పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# ఉచిత విద్య అభినందనీయం : ఎంఎల్‌సి రామ్మోహన్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మాంటిస్సోరి జూనియర్ కళాశాలలో సూర్య ఎడ్యుకేషన్ అకాడమీ సహకారంతో నిర్వహించిన మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్‌కు 45 స్కూల్స్ నుంచి 1136 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మెరిట్ స్కాలర్‌షిప్ టెస్టుకు సంబంధించిన ప్రశ్న పత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాంటిస్సోరి జూనియర్ కళాశాల యాజమాన్యం నాణ్యమైన విద్యను ప్రతిభవంతులైన పేద విద్యార్థులకు ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఇంటర్‌లో ఫ్రి ఎడ్యుకేషన్, స్కాలర్‌షిప్ అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన టెస్ట్‌కు మంచి స్పందన లభించినట్లు కళాశాల అకాడమిక్ డైరెక్టర్ కెవి.కృష్ణవర్మ తెలిపారు. హాజరైన విద్యార్థులకు పదో తరగతిలో నూతనంగా మార్చిన మోడల్ పేపర్ బుక్ లెట్స్ ఉచితంగా పంపిణీ చేశారు. టెస్ట్ నిర్వహణలో సహకరించిన వివిధ పాఠశాలల యాజమాన్యాలకు, హెచ్ఎంలకు మాంటిస్సోరి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రకాష్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

మెరిట్ స్కాలర్షిప్ టెస్ట్ ప్రశ్నాపత్రం విడుదల చేస్తున్న ఎంఎల్‌సి రామ్మోహన్

## పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ ఆదివారం పర్యాటకుల సందడితో కళకళలాడింది. సుదూర ప్రాంతాల నుండి పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక, ద్విచక్ర వాహనాలపై బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. సముద్రపు స్నానాలు చేశారు. సరివే, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి ఆహ్లాదంగా గడిపారు.

## పేద విద్యార్థులకు రాయల్ క్లబ్ సేవలు భేష్

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

పేద విద్యార్థుల భవితకు రాయల్స్ క్లబ్ సేవలు అభినందనీయమని పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక తెలగా కళ్యాణ మండపంలో ఆదివారం రాయల్స్ క్లబ్ ఆధ్వర్యంలో సుమారు 120 మంది పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామానాయుడు, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు మాట్లాడుతూ విపత్కర పరిస్థితుల్లో పేదలను ఆదుకోవడంలో, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో, విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇచ్చేందుకు ప్రోత్సహించడంలో రాయల క్లబ్ ముందుందన్నారు. సేవా భావాలు కలిగిన డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ, ఐఐటీ మద్రాస్ పూర్వ విద్యార్థి తులసి రామచంద్ర ప్రభు రాయల్ క్లబ్ ద్వారా అందిస్తున్న సేవలను ప్రశంసించారు. నరసాపురానికి చెందిన ఆదిపరాశక్తి నృత్య నికేతన్ విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

## వెంకటేశ్వరరావుకు ఎంఎల్‌ఎ మంతెన పరామర్శ

ఉండి :ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టిడిపి ఆరేడు గ్రామ కమిటీ అధ్యక్షులు గొట్టం వెంకటేశ్వరరావు(బాబి)ను ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు ఆదివారం పరామర్శించారు. వెంకటేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడి ఆరా తీసి వెంక టేశ్వరరావుకు మెరుగైన వైద్యం ఇవ్వాలని వైద్యులకు సూచించారు.

## 'బిసిల అభ్యున్నతి టిడిపితోనే సాధ్యం'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి పశ్చిమగోదావరి జిల్లా బిసి సెల్ విస్తృతస్థాయి సమావేశం భీమవరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కర్నేన గౌరునాయుడు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో బిసిలకు రాజకీయ లబ్ధి చేకూరిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో బిసిలకు అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందాయన్నారు. ఎంఎల్‌సి అంగర రామమోహన్‌రావు మాట్లాడుతూ టిడిపి హయాంలో బిసి స్లాబ్ ద్వారా రూ.36 వేల కోట్లు బిసిల అభివృద్ధికి ఖర్చు చేసినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షులు కర్నేన గౌరునాయుడు మాట్లాడుతూ త్వరలో నిర్వహించనున్న జిల్లా బిసి సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిస్తూ పలు తీర్మానాలను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాస్, దొమ్మేటి వెంకట సుధాకర్, పాలవలస తులసీరావ్ పాల్గొన్నారు.

## జూదాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - పాలకోడేరు

సంక్రాంతి పండుగ నేపథ్యంలో జూదా క్రీడలు ఆడితే చర్యలు తీసుకుంటామని భీమవరం రూరల్ సిఐ సిహెచ్.నాగప్రసాద్ హెచ్చరించారు. గోరగనమూడి సచివాలయంవద్ద జూదా క్రీడలపై గ్రామస్తులకు ఆదివారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రవానికి సర్పంచి గొట్టుముక్కల వెంకట శివరామరాజు (శివాజీ రాజు) అధ్యక్షత వహించారు. సిఐ నాగప్రసాద్ మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా సంక్రాంతి పండుగ నిర్వహించుకోవాలన్నారు. కోడిపందేలు, జూదా క్రీడల వైపు వెళ్లరాదన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ షేక్ హుస్సేన్, ఎస్ఐ సిహెచ్.రామచంద్రరావు, ఆర్ఐ నాగభూషణం, పంచాయతీ కార్యదర్శి పోలయ్య పాల్గొన్నారు.

## 'గ్రామ కమిటీలే కీలకం'

ప్రజాశక్తి - ఉండి

గ్రామ పార్టీ కమిటీలే జనసేనకు పునాదులని ఆ పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు అన్నారు. మండలంలోని చెరుకువాడ గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎడవల్లి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు గొట్టుముక్కల సుబ్బరాజు అధ్యక్షతన ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జుత్తుగ నాగరాజు, రాష్ట్ర ప్రోగ్రామింగ్ కమిటీ కార్యదర్శి తోట వాసు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పార్టీ బలోపేతం అయితేనే నియోజకవర్గంలో పార్టీ అధికారంలోకి వస్తుందని తెలిపారు. అనంతరం పార్టీ గ్రామ కమిటీ నూతన అధ్యక్షునిగా బొల్లా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా బాలం యాకోబు, ప్రధాన కార్యదర్శిగా కుచ్చులపల్లి జీవన్‌బాబు, కోశాధికారిగా యాళ్ల ఇశ్రాయేలును నాగరాజు నియమించారు.

## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి - నరసాపురం

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని వైఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.కనకరావు అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణ వ్యాప్తంగా ఆటల పోటీలు, క్విజ్ కాంపిటేషన్ నిర్వహించారు. వైఎన్ ఇంటర్ కళాశాలలో నిర్వహించిన క్విజ్ కాంపిటీషన్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ కనకరావు మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి క్విజ్, డిబేట్, ఉపన్యాస పోటీల్లో పాల్గొనడం ద్వారా వారిలో ఉన్న భయాలు దూరమవుతాయన్నారు. విద్యార్థులకు అనేక విషయాలపై అవగాహన వస్తోందన్నారు. పదిమందిలో ఎంతో చాకచక్యంగా మాట్లాడుతూ ఎంతో ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. వైఎన్ ఇంటర్ కళాశాల ప్రిన్సిపల్ అందే రామకృష్ణ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలను నిర్వహించడం ఆనందదాయకమన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు ఎండి జాన్ మాట్లాడుతూ నరసాపురం నియోజకవర్గం స్థాయిలో 30 విద్యాసంస్థల్లో సంక్రాంతి పండుగ సందర్భంగా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనవరి తొమ్మిదో తేదీ వరకు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ సహాయ కార్యదర్శి ఎం.సాయి కృష్ణ, సభ్యులు సిహెచ్.కిరణ్, కె.ఫణికుమార్, సన, ఎస్.అరవింద్‌రెడ్డి, మణికంఠ, గణపతి, వైష్ణవి, భార్గవి, మనిష, జ్యోతి, నాగ దుర్గ, మౌనిక, అనిల్, నాని పాల్గొన్నారు.

## యుటిఎఫ్ పాలకొల్లు కమిటీ ఎన్నిక

యుటిఎఫ్ పట్టణ కమిటీ

ప్రజాశక్తి - పాలకొల్లు

యుటిఎఫ్ పట్టణ నూతన కమిటీ ఎన్నికైంది. స్థానిక ఎంఎంకెఎన్ఎం హైస్కూల్లో యుటిఎఫ్ పట్టణ శాఖ మహాసభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికలో నూతన అధ్యక్షులుగా యనమండ్ర ప్రభాకర్‌శాస్త్రి, ప్రధాన కార్యదర్శిగా కె.త్రినాథ్ ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా ఎస్.చిట్టిబాబు, సహాధ్యక్షులుగా జెజె.దుర్గారావు, ఇ.శ్రీలక్ష్మి, కోశాధికారిగా ఎస్.రాంజీకుమార్, కార్యదర్శులుగా జి.మండెల పెద్ద స్వామి, పితాని ధర్మారావు, గూడూరు వెంకటేశ్వర్లు, పడమటి రాజబాబు, బడుగు త్రిమూర్తులు, ఆరేపల్లి వెంకటరత్నం, తిక్కా పద్మావతి, అంకాని శ్రీనివాసరావు, గంగులూరి రాజశేఖర్, హౌస్ ఆడిటర్‌గా శివప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ మహాసభలో యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, జిల్లా అధ్యక్షులు పి.విజయరామరాజు, ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, జిల్లా కార్యదర్శులు జి.లక్ష్మీనారాయణ, పి.క్రాంతికుమార్, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ నూతన పాలకవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక వాసవి క్లబ్ పాలకొల్లు 2023 సంవత్సరానికి నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం స్థానిక కంచర్ల పురుషోత్తం వాసవీ క్లబ్ కళ్యాణమండపంలో ఆదివారం జరిగింది. నూతన అధ్యక్షునిగా ఇమ్మిడి రాజేష్, ప్రధాన కార్యదర్శిగా పలివెల శివ, కోశాధికారిగా చవ్వా సతీష్ కుమార్ ప్రమాణస్వీకారం చేశారు. వాసవి జిల్లా గవర్నర్ కొల్లేపర కృష్ణాజి ప్రమాణ స్వీకారం చేయించారు. వాసవి క్లబ్ ఇంటర్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ బోడా సూర్యప్రకాష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రమాణస్వీకారంలో భాగంగా ముగ్గురు పేద మహిళలకు కుట్టు మిషన్లు, ముగ్గురు పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఇద్దరు పేద విద్యార్థులకు సైకిళ్లు, వాసవి క్లబ్ ఇంటర్ నేషనల్ సరస్వతి పథకానికి రూ.25 వేల విరాళం అందించారు. అష్టభుజ లక్ష్మీనారాయణస్వామి దేవస్థానంలో స్టీల్ లెటర్ నిమిత్తం రూ.25 వేలు ఇచ్చారు. సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బొండాడ భాస్కర్, జిల్లా కోశాధికారి వెంకటేశ్వర్లు, ఇంటర్నేషనల్ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ వైస్ ప్రెసిడెంట్ గాదె జనార్ధన్ గుప్తా, జిల్లా మాజీ గవర్నర్లు మైథిలి, మాటూరి నరసింహమూర్తి పాల్గొన్నారు.

## నాట్లు వేసేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి - పెనుమంత్ర

రైతులు వరినాట్లు వేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి మద్దాల జయదుర్గమాధురి అన్నారు. ఆదివారం ఆమె ఓడూరులో రైతులనుద్దేశించి మాట్లాడుతూ నారు తీసేటప్పుడు, నాట్లు వేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా మాధురి మాట్లాడుతూ నారు తీసేటప్పుడు వరినారు కొనలను తుంచి వేయాలన్నారు. ఇలా చేయడం వల్ల కాండం తొలుచుపురుగు ఆశించడాన్ని నివారించొచ్చన్నారు. ఈ నాట్లకు 25 రోజుల వరకు ఏ విధమైన పురుగుమందులు పిచికారీ చేయాల్సిన అవసరం ఉండదని స్పష్టం చేశారు. ఫలితంగా పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయన్నారు.

వరి దుబ్బు చివర తుంచుతున్న ఎఒ జయదుర్గమాధురి

## జాతీయ స్థాయి పోటీల్లో వెస్ట్ బెర్రీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కాళ్ల

ఈ నెల 2, 3, 4వ తేదీల్లో రోహ్తక్ హర్యానా రాష్ట్రంలో జరిగిన సిబిఎస్‌సి జాతీయ స్థాయి రోప్ స్కిప్పింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో బెర్రీ స్కూల్ విద్యార్థులు విజయ కేతనం ఎగురవేశారని స్కూల్ డైరెక్టర్ నడింపల్లి మహేష్ కుమార్ ఆదివారం తెలిపారు. బంగారు, రజతం, కాంస్య పతకాలు సాధించిన విద్యార్థులను స్కూల్ డైరెక్టర్ నడింపల్లి మహేష్ కుమార్, ప్రిన్సిపల్ సత్యవోలు హేమావతి అభినందించారు. గతేడాది డిసెంబర్ 28, 29, 30వ తేదీల్లో నిర్వహించిన సిబిఎస్ఇ నేషనల్ లెవెల్ ఆర్చరీలో వెస్టుబెర్రీ హై స్కూల్ విద్యార్థిని కర్రి సుష్మిత మూడో స్థానాన్ని కైవసం చేసుకుని ఒక కాంస్య పతకం సాధించింది.

## మత్స్యకారుల ఉపాధి కాపాడండి : సిఐటియు

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - పెనుగొండ

ఇసుక అక్రమ తవ్వకాల వల్ల సిద్ధాంతం, దొంగరావిపాలెం గ్రామాల మత్స్యకారులకు ఉపాధి లేకుండా పోతుందని సిఐటియు జిల్లా నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. వశిష్ట గోదావరి కుడివైపు పాయ వెంబడి అక్రమ ఇసుక తవ్వకాలను సిఐటియు నాయకులు ఆదివారం అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మత్స్యకారుల ఉపాధికి నష్టం కలిగించే ఇసుక తవ్వకాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పెనుగొండ మండల అధ్యక్షులు నాగిశెట్టి గంగారావు, సిద్ధాంతం సొసైటీ అధ్యక్షులు కనకరాజు, దొంగరావిపాలెం సొసైటీ అధ్యక్షులు మోకా సూర్యచంద్రరావు, వాతాడి అర్జున్‌రావు, కర్రీ కొండయ్య, రాంబాబు, లక్ష్మీనారాయణ, సంపతరావు, నారాయణమూర్తి, కొప్పాడి వీరవెంకట సత్యనారాయణ, గేదెల పోసియ్య, వాతాడి సంసోనురాజు, పల్లపోలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## కొమ్ముచిక్కాలలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని కొమ్ముచిక్కాల గ్రామంలో ఆదివారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. వైసిపి పాలనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, పాలవలస తులసిరావు, దాసరి రత్నరాజు, గొట్టుముక్కల రఘు పాల్గొన్నారు.

## 11 నుంచి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - మొగల్తూరు

జగనన్న సంక్రాంతి సంబరాలు పురస్కరించుకుని జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వన్నెకుల కార్పొరేషన్ డైరెక్టర్ బంధన పూర్ణచంద్రరావు తెలిపారు. ఆదివారం ఆయన ముత్యాలపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు గ్రామంలోని ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ప్రారంభమవుతాయన్నారు.

## విస్సాకోడేరులో అన్న సమారాధన

ప్రజాశక్తి - పాలకోడేరు

విస్సాకోడేరు వంకాయలపాలెం రామాలయం, శెట్టిబలిజపాలెం రామాలయంలో ఆదివారం నిర్వహించిన అఖండ అన్న సమారాధనలో ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు డిటి.కోటేశ్వరాజు, ఉపాధ్యక్షులు ఎన్‌వి.అప్పారావు, గ్రామ అధ్యక్షులు బొర్రా కోటేశ్వరరావు, తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి ఆరేపల్లి నాగలక్ష్మి నాగరాజు, కె.కల్యాణ్, బొక్క శ్రీనివాస్, గుత్తుల త్రినాధ్, అల్లూరి విశ్వనాధ్ రాజు, టి.హరీష్, ఎర్రవరపు నాగరాజు, ఎం.శివ, కె.దుర్గారావు పాల్గొన్నారు.

## డ్వాక్రా మహిళలకు గొర్రెల పంపిణీ

ప్రజాశక్తి - అత్తిలి

ఎంపిడిఒ కార్యాలయంలో ఆదివారం ఎంపిపి మక్కా సూర్యారావు ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు జీవనోపాధిలో భాగంగా నెల్లూరి జ్యూడిపి గొర్రెలు పంపిణీ చేశారు. మండలంలో 11 యూనిట్లు పది మందికి యూనిట్ రూ.50 వేలు విలువైన గొర్రెలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వివిఎస్.రామారావు, ఐకెపి ఎపిఎం పి.మురళీకృష్ణ, సిసి కె.సునీత, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## జాన్సన్‌ను కలిసిన ఉండి సర్పంచి దంపతులు

ప్రజాశక్తి - ఉండి

వైసిపి క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన మేడిది జాన్సన్‌ను ఉండి గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ దంపతులు ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనారిటీ క్రైస్తవులను ఎస్‌సిలో చేర్చేలా కృషి చేయాలని ఆయనను కోరినట్లు వారు తెలిపారు. ఈ విషయంపై ఆయన స్పందించి క్రైస్తవుల అభ్యున్నతికి కృషి చేస్తానని చెప్పినట్లు తెలిపారు. మైనారిటీ క్రైస్తవులను ఎస్‌సిల్లో చేర్చాలనే విషయాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారని చెప్పారు.

## నిత్యాన్నదానం అభినందనీయం

ప్రజాశక్తి - పాలకొల్లు

ధనుర్మాసం సందర్భంగా నెలరోజుల పాటు చిన్న గోపురంలో నిత్యాన్నదానం నిర్వహించడం అభినందనీయమని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ చెప్పారు. పాలకొల్లు శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి వారి(చిన్నగోపురం) ఆలయంలో ఆదివారం స్వామి వారిని దర్శించుకుని 23వ రోజు ధనుర్మాస వ్రత అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చందక సత్తిబాబు, ఆలయ ఛైర్మన్ వెంకన్న, మామిడిబాబు, సూరిబాబు పాల్గొన్నారు.

## పేరు మార్పు

**ఎలిసేల ఆనంద రావు,** నివాసం : 10-10-6, హరిజన పేట, 18వ వార్డు, తాళ్ళముదునూరుపాడు, తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి (జిల్లా), ఆంధ్రప్రదేశ్-534102, అను నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా పేరు మరియు నా తండ్రి గారి పేరు **ఆనంద రావు ఇ, తండ్రి, ఇఆర్ రత్నం** అని తప్పుగా నాయొక్క సిబిఎస్ఇ మెట్రిక్యులేషన్ సర్టిఫికేట్‌లో నమోదు కాబడినది. కాని **ఎలిసేల ఆనందరావు, తండ్రి : ఎలిసేల రాజ రత్నం** గా అన్ని వ్యవహారాలలో ఉపయోగించవలెను.

**మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**
**ఇ.పి. నెం. 49/2012 ఇన్**
**ఒ.యస్. నెం. 84/2008**

బిట్వీన్:
శ్రీ మారిశెట్టి వెంకటేశ్వరరావు (died) మరియు మరి కొందరు ...డి. హెచ్. ఆర్‌లు
&
శ్రీ పులి లక్ష్మయ్య (died) మరి కొందరు ...జె. డి. ఆర్‌లు

పైన పేర్కొన్న డిక్రీ హోల్డరు జె.డి.ఆర్‌లపై డిక్రీ పొంది డిక్రీ వసూలు నిమిత్తము షెడ్యూలు స్థిరాస్తిని అమ్మి డిక్రీ బాకీ వసూలు చేయమని కోరుచూ శ్రీ కోర్టు వారి ఎదుట ఇ.పి. దాఖలు చేయగా శ్రీ కోర్టు వారు షెడ్యూలు స్థిరాస్తిని వేలం పాట ద్వారా అమ్ముటకు ది. 02-02-2023 సం॥ తేదీ నిర్ణయించినారు. వేలం పాటలో పాల్గొని షెడ్యూలు స్థిరాస్తిని కొనుగోలు చేయుటకు యిష్టత ఉన్నవారు **ది. 02-02-2023 సం॥ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥ల** లగాయతు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరయి పాట పాడుకొని కొనుగోలు చేసుకొనవచ్చును.

**షెడ్యూలు**

పూర్వం పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, భీమడోలు సబ్ రిజిస్ట్రార్ పరిధిలో గల నారాయణపురం గ్రామపంచాయతీలో గల డోర్ నెం. 1-89, 200 చదరపు గజముల తాటియాకుల ఇంటికి సరిహద్దులు.
**తూర్పు:** శ్రీ దొడ్డిగర్ల ముసలయ్య గారి ఇల్లు.
**దక్షిణం:** రోడ్డు.
**పడమర:** శ్రీ కొమ్మిన ముసలయ్య గారి ఇల్లు స్థలం.
**ఉత్తరం:** శ్రీ మార్లపూడి బంగారయ్య గారి పెంకుటిల్లు, స్థలం.
పై హద్దుల మధ్య గల 200 చ॥గ॥ స్థలములో తాటియాకుల ఇల్లు స్థలము యావత్తు యాజిమెంటు హక్కులతో సహా.
**డి. హెచ్. ఆర్. వాల్యూ: రూ. 1,25,000/-**
**అమీనా వాల్యూ: రూ. 10,00,000/-**
**జె.డి.ఆర్. వాల్యూ: రూ. 10,00,000/-**

**కొండేపాటి వెంకటేశ్వరరావు,** అడ్వకేటు
తాడేపల్లిగూడెం, సెల్: 9848355344